




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 166 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :166 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 20 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

### సజ్జనార్ నుంచి మరో అలర్ట్

- సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగులను వాడుకుని పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- ప్రభుత్వ, బ్యాంకింగ్ వెబ్‌సైట్లను పోలిన నకిలీ సైట్లతో వినియోగదారులకు వల
- వివరాలు నమోదు చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిక
- యూఆర్ఎల్ సరిచూసుకోవాలని, స్పాన్సర్డ్ లింకులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

- మిగతా 2లో



## విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'

- విశాఖ ఆర్కే బీచ్‌లో ఘనంగా అంతర్జాతీయ సిటీ పరేడ్
- భారత దళాలతో పాటు పలు దేశాల నావికాదళాల కవాతు
- అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు, కమాండోల ప్రదర్శనలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- వివిధ దేశాల సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

2లో




# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

## ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు



- ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు.ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం

- మిగతా 2లో



## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

- ఏఐ పటంలో భారత్ ను నాయకుడిగా నిటబెట్టడమే లక్ష్యమన్న అశ్విని వైష్ణవ్
- విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను తీసుకొస్తామని వెల్లడి
- పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్న కేంద్ర మంత్రి

- మిగతా 2లో

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!



- ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఐబీఎం, ఐఐటీ మద్రాస్, ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు
- 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ
- కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న చంద్రబాబు

- మిగతా 2లో

## ఉచిత పథకాలతో డబ్బు వృధా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..



- ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం.. ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!
- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య


- మిగతా 2లో

# రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి...

## ఏఐ రంగంలో రిలయన్స్ గ్రూప్ సంచలనం

- ఏఐ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్న జియో-రిలయన్స్
- వచ్చే ఏడేళ్లలో ఈ భారీ పెట్టుబడిని పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడి
- గిగావాట్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎడ్జ్ కంప్యూటింగ్‌పై ప్రధాన దృష్టి
- ఏఐ ఉద్యోగాలను సృష్టిస్తుందే తప్ప, తీసేయదని స్పష్టం చేసిన అంబానీ

- మిగతా 2లో



## బొత్స గారూ... మీకు చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా?



- మండలిలో హెరిటేజ్‌పై వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి అచ్చెన్నాయుడు
- చీజ్ ప్యాకెట్లు చూపి నెయ్యి అని ప్రచారం చేస్తున్నారని బొత్సపై విమర్శలు
- హెరిటేజ్‌పై ఒక్క ఆధారమైనా చూపాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- అసత్య ఆరోపణలపై హెరిటేజ్ ఇప్పటికే లీగల్ నోటీసులు ఇచ్చిందని వెల్లడి
- ప్రతిష్ఠాత్మక సంస్థలపై దాడి చేయడం వైసీపీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనమని వ్యాఖ్య

- మిగతా 2లో



## పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!

### జగన్‌పై మంత్రి అనిత సెటైర్

- టీటీడీ నెయ్యి సరఫరాపై జగన్ ఆరోపణలకు మంత్రి అనిత కౌంటర్
- హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
- సాక్షి పేపర్, భారతీ సిమెంట్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేసిన అనిత
- వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే నెయ్యి కల్తీ జరిగిందని తీవ్ర ఆరోపణలు
- కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై బురద జల్లడమేంటని జగన్‌పై ఫైర్

- మిగతా 2లో

### తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో

# ఎదురు కాల్పులు..

## ఇద్దరు మావోయిస్టులు మృతి

- మావోయిస్టు అగ్రనాయకుల కోసం కర్రెగుట్టల్లో భద్రతా దళాల గాలింపు
- సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు

**పెన్ పవర్ డెస్క్:**సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో కూంబింగ్ ను కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు

- మిగతా 2లో



## చూసిందే నమ్మండి

### హెరిటేజ్ పై నారా భువనేశ్వరి ప్రత్యేక వీడియో




**పెన్ పవర్ డెస్క్:**హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తమ సంస్థ నాణ్యతా

- మిగతా 2లో

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



- లేపాక్షి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన బాలకృష్ణ
- మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు బీటీ రోడ్డు పనులకు భూమిపూజ
- రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం
- పులమతి చెరువులో హంద్రీనీవా జలాలకు జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే

## ఎడిటర్ వ్యూ

### పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ
### తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!

తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా అంశంలో వైసీపీ అధినేత జగన్ ఇవాళ మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు సమస్య అయిన కల్తీని పక్కనపెట్టి, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె, జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

**హెరిటేజ్‌కు, ఇందాపూర్‌కు సంబంధమే లేదు**

జగన్ ఆరోపిస్తున్నట్లుగా హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని అనిత స్పష్టం చేశారు. ఇందాపూర్ అనేది బల్క్ మార్కెటింగ్ చేసే సంస్థ అని, అది చీజ్, పన్నీర్, టెట్రాప్యాక్ పాలు వంటి ఉత్పత్తులను తయారు చేసి హెరిటేజ్ వంటి కంపెనీలకు విక్రయిస్తుందని వివరించారు. హెరిటేజ్ సంస్థ నేరుగా వినియోగదారులకు మాత్రమే నెయ్యిని విక్రయిస్తుందని, ఎన్నడూ బల్క్‌గా ట్యాంకర్ల ద్వారా ఇతర కంపెనీలకు సరఫరా చేయలేదని తెలిపారు. “హెరిటేజ్ నుంచి ఇందాపూర్‌కు నెయ్యి వెళ్లి, అక్కడి నుంచి టీటీడీకి వస్తుందని చెప్పడానికి కనీసం బుర్ర పనిచేస్తుందా?” అని ఆమె ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ తన సిద్ధాంతాల ప్రకారం దేవాలయాలకు బల్క్‌గా సరఫరా చేయదని, ఈ విషయం చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడని అన్నారు.

**ధరల పెరుగుదలపై చిన్న లాజిక్ మిస్సయ్యారు**

2015లో రూ.280 ఉన్న నెయ్యి ధర, 2026 నాటికి రూ.650కి ఎందుకు పెరిగిందని జగన్ ప్రశ్నించడాన్ని అనిత తప్పుబట్టారు. కాలంతో పాటు ధరలు పెరగడం సహజమని, ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా విస్మరించారని ఆమె ప్రశ్నించారు. “మీరు సాక్షి పేపర్ ప్రారంభించినప్పుడు దాని ధర రూ.2, ఇప్పుడు రూ.6.50. భారతీ సిమెంట్ బస్తా ధర రూ.250 నుంచి రూ.450కి పెరిగింది. 2015లో రూ.19 ఉన్న పాల ప్యాకెట్ ఇప్పుడు రూ.40కి చేరింది. పాల ధర పెరిగితే నెయ్యి ధర పెరగదా? బహుశా పాలు లేకుండానే నెయ్యి తయారుచేసే టెక్నాలజీ మీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో” అని ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటకలో పాల ధరలు అధికంగా ఉండటం వల్లే నందిని డైరీ టీటీడీకి రూ.700కు నెయ్యి సరఫరా చేసిందని, ఆ విషయం గురించి జగన్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు.

**అసలు దొంగ మీ బాబాయే**

అసలు సమస్య అయిన నెయ్యి కల్తీ గురించి మాట్లాడకుండా, జగన్ సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని అనిత ఆరోపించారు. నెయ్యి కల్తీ జగన్ ప్రభుత్వ హయాంలో, ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. “నెయ్యిలో రసాయనాలు కలిశాయని సిట్, ఎన్డీబీ రిపోర్టులు స్పష్టంగా తేల్చాయి. కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా అప్పటి మీ ప్రభుత్వం ఆ కంపెనీ టెండర్‌ను ఎందుకు రద్దు చేయలేదు? ఎందుకు ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టలేదు?” అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కల్తీ జరిగిందని చార్జ్‌షీట్‌లో ఉన్నా, మీ బాబాయి స్వయంగా అంగీకరించినా దాని గురించి మాట్లాడకుండా, ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపినట్లు హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

**టెండర్ నిబంధనలు మార్చిందెవరు?**

కేవలం తమకు నచ్చిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను నీరుగార్చిందని అనిత ఆరోపించారు. “ఒక చుక్క పాలు కూడా సేకరించని కంపెనీలు కూడా నెయ్యి సరఫరా చేసేలా నిబంధనలను మార్చారు. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించారు. ఇవన్నీ ఎవరికోసం చేశారు? కల్తీపై చర్చకు మేము సిద్ధం. ఆధారాలు చూపించమన్నందుకే ప్రజలకు ఈ వాస్తవాలు వివరిస్తున్నాం. దమ్ముంటే కల్తీ గురించి మాట్లాడండి” అని జగన్‌కు ఆమె సవాల్ విసిరారు.

### రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి...

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో కలిసి భారీ అడుగు వేయనున్నాయి. రాబోయే ఏడేళ్లలో ఈ రంగంలో రూ.10 లక్షల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ గురువారం ప్రకటించారు. ‘ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్’లో ప్రసంగించిన ఆయన, ఈ పెట్టుబడి కేవలం లాభాల కోసం కాదని, దేశ నిర్మాణం కోసం దశాబ్దాల పాటు ఆర్థిక విలువను సృష్టించే మూలధనమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏఐ రంగంలో అతిపెద్ద సమస్య కంప్యూటింగ్ వనరుల కొరత, అధిక ఖర్చు అని అంబానీ అన్నారు. ఈ సవాలును అధిగమించేందుకు ‘జియో ఇంటెలిజెన్స్’ ద్వారా మూడు కీలక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జామ్‌నగర్‌లో గిగావాట్-స్థాయి ఏఐ-రెడీ డేటా సెంటర్ల నిర్మాణం ప్రారంభించామని, 2026 ద్వితీయార్థంలో 120 మెగావాట్ల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రెండోది, తమకున్న గ్రీన్ ఎనర్జీ సామర్థ్యమని, ఆంధ్రప్రదేశ్, కచ్‌లలోని సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి 10 గిగావాట్ల గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని వివరించారు. మూడోది, దేశవ్యాప్తంగా ఎడ్జ్ కంప్యూటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీని ద్వారా సామాన్యులకు సైతం తక్కువ ఖర్చుతో, వేగవంతమైన ఏఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

అన్ని భారతీయ భాషల్లో ప్రపంచస్థాయి ఏఐ సామర్థ్యాన్ని సాధించడం తమ లక్ష్యమని, ఇది సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏఐ ఉద్యోగాలను తీసివేయదని, కొత్తగా నైపుణ్యం గల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంబానీ భరోసా ఇచ్చారు. దేశంలోని స్టార్టప్‌లు, ఐఐటీలు, పరిశోధన సంస్థలతో పాటు ప్రపంచంలోని అగ్రశ్రేణి టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని, ఏఐ శతాబ్దానికి భారత్‌ను సహ-నిర్మాతగా నిలుపుతామని ఆయన వెల్లడించారు.

### చూసిందే నమ్మండి

- మొదటి పేజి తరువాయి

ప్రమాణా లపై వినియోగదారులకు భరోసా ఇస్తూ ‘హెరిటేజ్ ప్రామిస్’ పేరుతో ఒక వీడియోను విడుదల చేశారు. ‘చూసిందే నమ్మండి’ అనే నినాదంతో విడుదలైన ఈ వీడియోలో కంపెనీ పనితీరు, రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలను ఆమె వివరించారు. గత 33 ఏళ్లుగా ప్రతి ఇంటికి తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు అందించడమే లక్ష్యంగా హెరిటేజ్ పనిచేస్తోందని భువనేశ్వరి తెలిపారు. రూ.4 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన సంస్థ, నేడు రూ.4,000 కోట్ల స్థాయికి ఎదిగినా నాణ్యత విషయంలో ఎన్నడూ రాజీ పడలేదని ఆమె స్పష్టం చేశారు. వినియోగదారుల ఇంటికి చేరే ప్రతి ఉత్పత్తి 25 కఠినమైన నాణ్యతా పరీక్షలు దాటిన తర్వాతే వస్తుందని, 500 మందికి పైగా నిపుణులు ఈ ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తారని ఆమె పేర్కొన్నారు.

తొమ్మిది రాష్ట్రాల్లోని సుమారు 3 లక్షల మంది పాడి రైతులతో తమ సంస్థ కలిసి పనిచేస్తోందని భువనేశ్వరి వివరించారు. పారదర్శకత, న్యాయమైన ధర, సకాలంలో చెల్లింపులు అనే సూత్రాలతో రైతులకు సాధికారత కల్పిస్తున్నామని అన్నారు. ఈ వీడియోను పూర్తిగా చూసి, వాస్తవాలను స్వయంగా తెలుసుకోవాలని ఆమె ప్రజలను కోరారు.

# ఇది బాబు భజన..అన్నీ తప్పుడు లెక్కలే

- మొదటి పేజి తరువాయి

పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. “రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను” అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## విశాఖలో వేడుకగా ‘ఇంటర్నేషనల్ సిటీ పరేడ్’

‘సిటీ ఆఫ్ డెస్టినీ’ విశాఖపట్నం సాగర తీరం గురువారం సాయంత్రం అద్భుత ప్రదర్శనలకు వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (×ఖీ=), మిలన్ 2026 వేడుకల్లో భాగంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలు, వివిధ దేశాల సాంస్కృతిక వైభవానికి ఈ పరేడ్ దర్పణం పట్టింది.

ఈ భారీ పరేడ్‌లో భాగంగా తొలుత భారత నావికాదళ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో అబ్బురపరిచే విన్యాసాలు చేశాయి. అనంతరం భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్), కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు కవాతు నిర్వహించాయి. వీరితో పాటు ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు, డ్రోన్, లేజర్ షోలు,

చివరిలో బాణసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వివిధ దేశాల కళాకారులు వారి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాలతో సముద్ర భద్రతలో సహకారాన్ని, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పరేడ్‌ను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

సాంకేతికత పెరిగాక ఏ చిన్న సమాచారం కావాలన్నా వెంటనే గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే, మనకున్న ఈ అలవాటే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఆయుధంగా మారింది. సెర్చ్ ఫలితాల్లో అగ్రస్థానంలో కనిపించినంత మాత్రాన అది అసలైన, సురక్షితమైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే నిలువునా మోసపోయే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

**మోసగాళ్ల కొత్త ఎత్తుగడ ఇదే**

సైబర్ మోసగాళ్లు ఇప్పుడు ‘సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్’ (ఎస్ఈవో) అనే అధునాతన టెక్నిక్‌ను, పెయిడ్ ప్రకటనలను వాడుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ పోర్టల్స్, ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేర్లతో అచ్చుగుద్దినట్టు ఉండే నకిలీ ‘ఫిషింగ్’ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్లు, ప్రభుత్వ పథకాలు లేదా ఇతర సేవల కోసం వెతికినప్పుడు, ఈ నకిలీ సైట్లు సెర్చ్ ఫలితాల్లో టాప్‌లో కనిపించేలా చేస్తున్నారు. వీటిపై ‘హజూశీఅంశీతీవస’ లేదా ‘ూ౦’ అని చిన్న అక్షరాలతో ఉంటుంది. వాటిని గమనించకుండా నిజమైన వెబ్‌సైట్ అని భ్రమపడి క్లిక్ చేయగానే మోసం మొదలవుతుంది. వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే వ్యక్తిగత వివరాలు, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, సీవీవీ, ఓటీపీ వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేయమని కోరతారు. ఆ వివరాలు వారికి చిక్కగానే క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తారు. కేవలం ఆర్థికంగా నష్టపరచడమే కాకుండా, మీ గుర్తింపు పత్రాలను దొంగిలించి ‘ఐడెంటిటీ థెఫ్ట్’కు పాల్పడే ప్రమాదం కూడా ఉంది. అంటే మీ పేరు మీద రుణాలు తీసుకోవడం లేదా ఇతర నేరాలకు పాల్పడటం వంటివి చేయవచ్చు.

**రక్షణ కవచం అప్రమత్తతే**

ఈ తరహా మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు.

ఏదైనా వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు దాని చిరునామా (ఖ=ా)ను క్షుణ్ణంగా పరిశీలించాలి. అసలు వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు, నకిలీ వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు చిన్న తేడాలుంటాయి.

వీలైనంత వరకు సెర్చ్ ఇంజిన్లలో వెతకడం కన్నా, మీకు తెలిసిన అధికారిక వెబ్‌సైట్ చిరునామాను నేరుగా బ్రౌజర్ అడ్రస్ బార్‌లో టైప్ చేసి ఓపెన్ చేయడమే సురక్షితం.

సెర్చ్ ఫలితాల్లో Sponsored లేదా Ad అని కనిపించే లింకులపై క్లిక్ చేసేటప్పుడు రెట్టింపు జాగ్రత్త అవసరం.

ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో మన అప్రమత్తతే మనకు రక్షణ కవచమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ భారత్ భవిష్యత్ ఏఐ ప్లాన్‌ను స్పష్టంగా వివరించారు. దేశాన్ని ప్రపంచ ఏఐ పటంలో నాయకుడిగా నిలబెట్టడమే లక్ష్యంగా పాఠశాల, కాలేజీ స్థాయి సిలబస్‌ను పూర్తిగా మారుస్తున్నామని ప్రకటించారు. విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు కేవలం సాంకేతికతను నేర్చుకోవడమే కాకుండా, సమస్యలకు కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. “దేశంలో ప్రతిభకు కొరత లేదు. యువత భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే... భారత్ ప్రపంచ ఏఐ పటంలో అగ్రస్థానంలో నిలుస్తుంది” అని అన్నారు. సెమీకండక్టర్, టెలికాం రంగాల్లో సాధించిన విజయాల తరహాలోనే ఏఐ మిషన్‌ను వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ వంటి సంస్థలు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ప్రశంసించారు.

## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..
## ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు (ఫిబ్రవరి 20) ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026’లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు. రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో

కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్గే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

**ఈ సాయంత్రం జైపూర్ కు!**

కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో ఎదురు కాల్పులు..
## ఇద్దరు మావోయిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జ్ కేసా సోఢీ ఈ ప్రాంతంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. సుమారు రెండు వేల మంది జవాన్లు కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా జల్లెడ పడుతుండగా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డాయి. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులు జరపగా, పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, సీఏఎఫ్ సంయుక్త బలగాలు గత ఏడాది ఏప్రిల్ నెలలో 21 రోజుల పాటు కర్రెగుట్టలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే అప్పుడు మావోయిస్టు పార్టీ సీనియర్ క్యాడర్ తప్పించుకుంది. వారి కోసం భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి.

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన..
## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం లేపాక్షి మండలంలో పర్యటించిన ఆయన, రెండు కీలకమైన బీటీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే, మండలంలోని మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం ఆయన పులమతి చెరువు వద్దకు చేరుకుని, హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఇదే పర్యటనలో భాగంగా కొత్తపల్లి నుంచి నాగేపల్లి వరకు నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలో రవాణా, సాగునీటి రంగాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా బాలకృష్ణ స్పష్టం చేశారు.

## ఉచిత పథకాలతో డబ్బు వృధా..
## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది. చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## బొత్స గారూ... మీకు చీజ్‌కు,
## నెయ్యికి తేడా తెలియదా?

హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. చీజ్ ప్యాకెట్లు చేతిలో పట్టుకుని, వాటిని నెయ్యి అని చూపిస్తూ ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతలకు కనీస అవగాహన ఉందా అని శాసనమండలిలో నిలదీశారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా తాను స్పష్టంగా సమాధానం ఇస్తున్నప్పటికీ, అదే అంశాన్ని పట్టుకుని సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యంగా మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి, “చీజ్ ప్యాకెట్లను చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మీకు చీజ్‌కు, నెయ్యికి మధ్య తేడా కూడా తెలియదా?” అని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై అంతగా అనుమానాలు ఉంటే ఒక్కటంటే ఒక్క చిన్న ఆధారాన్నైనా సభ ముందు పెట్టాలని, లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ అసత్య ప్రచారాలపై హెరిటేజ్ సంస్థ ఇప్పటికే వైసీపీ నేతలకు లీగల్ నోటీసులు పంపిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. “గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలతో పచ్చని తోటలు నరికించినట్లు, ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఆర్థిక మూలాలపై దాడి చేయాలని చూడటం మీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనం” అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని భారతి సిమెంట్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న చరిత్ర వైసీపీదని, కానీ హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా వ్యాపారం చేయాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సంస్థ అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిత్యం వాయిదా తీర్మానాలతో సభను పక్కదారి పట్టించడం మానేసి, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలని, నిర్మాణాత్మక చర్చకు రావాలని వైసీపీకి ఆయన సవాల్ విసిరారు.

# పెందుర్తి ప్రజల నమ్మకం పంచకర్ల



✸ అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తుతున్న ఎమ్మెల్యే

**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :** పంచకర్ల రమేష్ బాబుపై పెందుర్తి నియోజకవర్గ ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్తూ ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారని స్థానికులు అభినందిస్తున్నారు. తాజాగా జరిగిన శాసనసభ సమావేశాల్లో జీరో అవర్ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని పరవాడ మండలంలో కొనసాగుతున్న తీవ్రమైన కాలుష్య సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా పరవాడ ప్రాంతంలో ఉన్న ఎన్టిపిసి, హిందూజా గ్రూప్ ఆధ్వర్యంలోని పరిశ్రమలు, అలాగే ఫార్మాసిటీ పరిధిలోని కంపెనీల కారణంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభకు వివరించారు. పరవాడలంకెలపాలెం రహదారి సమీపంలో భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, దుమ్ము, కాలుష్యం కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ అంశాన్ని ఇప్పటికే నాలుగు సార్లు సభలో ప్రస్తావించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన పరిష్కారం కనిపించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆయా పరిశ్రమలకు ప్రత్యేక రహదారి ఏర్పాటు చేయాలని, వాహనాల రాకపోకలను నివాస ప్రాంతాల నుంచి మళ్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలా చేస్తే కనీసం 50 శాతానికి పైగా కాలుష్య సమస్య తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేక అనుమతి తీసుకుని నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును గెలిపించినందుకు తమ ఓటు విలువైనదైందని పెందుర్తి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తమ ప్రజా ప్రతినిధి పట్ల గర్వంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## ఈ నెల 21న స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం



✸ మార్కెట్లు, బస్టాండ్లు, ప్రభుత్వ స్థలాల్లో చెత్త తొలగింపు
✸ ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఫిబ్రవరి 19:**రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం కింద ఈ నెల 21వ తేదీ శనివారం, మార్కెట్లు, బస్టాండ్లు, ప్రభుత్వ స్థలాలు మరియు అధిక జన సంచారం ఉన్న ప్రాంతాల్లో చెత్త నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించిందని గూడెం కొత్త వీధి ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. "అన్ని పంచాయతీలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్ని పంచాయితీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని,గ్రామాల ప్రజలు ఈ చెత్త నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలని కోరుతున్నాము," అని తెలిపారు.అలాగే, 21వ తేదీన మండలంలోని స్వచ్ఛ రథం ప్రారంభిస్తామని, ఈ రథం అన్ని గ్రామాలను సందర్శించి డ్రై వెస్ట్ (ఎండిన చెత్త) సేకరణ చేపట్టనుందని ఆయన తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, గ్రామాలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచడంలో సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## విపిఏ కోసం రెండో 60 టన్నుల బోలార్డ్






పుల్ టగ్ నిర్మాణానికి హెచ్ఎస్ఎల్‌లో స్టీల్ కట్టింగ్ ప్రారంభం

**ములగాడ,, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :**విశాఖపట్నం హెచ్ఎస్ఎల్ లో విపిఏ కోసం నిర్మించనున్న రెండో 60 టన్నుల బోలార్డ్ పుల్ టగ్‌కు స్టీల్ కట్టింగ్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. విపిఏ డిప్యూటీ చైర్‌పర్సన్ కె. రోష్ని అపరంజి, హెచ్ఎస్ ఎల్ హల్ షాప్‌లో సిఎన్‌సి ప్లాస్మా కట్టింగ్ మెషీన్ బటన్‌ను నొక్కి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

రెండో 60 టన్నుల బిపి టగ్ నిర్మాణ ఒప్పందం 2025 డిసెంబర్ 22న కుదిరింది. ఒప్పందం కుదిరిన రెండు నెలల్లోనే స్టీల్ కట్టింగ్ ప్రారంభిం చడం హెచ్ఎస్ఎల్ కార్యనిర్వహణ సామర్థ్యా న్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే మొదటి టగ్‌కు కీల్ వేయబడగా, దాని నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.'మారిటైమ్ ఇండియా విజన్ 2030' మరియు 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా ఈ రెండు 60 టన్నుల బిపి టగ్‌లు విపిఏ నౌకాదళాన్ని ఆధునికీకరించ డంతో పాటు ఆపరేషనల్ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి. 32 మీటర్ల పొడవు గల ఈ టగ్‌లు అధిక మానేవరబిలిటీ, మెరుగైన ఎస్కార్ట్ పనితీరుతో రూపుదిద్దుకుంటున్నాయి. పెరుగుతున్న నౌకా రాకపోకలకు మద్దతు ఇవ్వ డం, టర్న్‌రౌండ్ టైమ్‌ను తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సామర్థ్యాన్ని పెంపొందించ డం వీటి ముఖ్య లక్ష్యాలు.

ఈ సందర్భంగా హెచ్ఎస్ఎల్ సీఎండీ కెప్టెన్ జి. వెంకటేశ్వర్లు ఐఎన్ రిటైర్డ్ మాట్లాడుతూ, విపిఏతో భాగస్వామ్యం తమకు గర్వకారణమ ని తెలిపారు. స్టీల్ కట్టింగ్ అనేది ఓ నౌక నిర్మా ణంలో ఆచరణాత్మక ఆరంభ దశ అని పేర్కొ న్నారు. దేశంలోని పలు ప్రధాన జాతీయ ప్రాజె క్టులు, ముఖ్యంగా ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ వంటి సం క్లిష్ట నావల్ ప్రాజెక్టులను హెచ్ఎస్ఎల్ వేగంగా అమలు చేస్తోందని వివరించారు. హెచ్ఎస్ఎల్ సిబ్బంది నైపుణ్యం, ఎంఎస్ఎంఈ భాగస్వాము ల సహకారం, విపిఏ విశ్వాసమే ఈ నౌకకు ప్రా ణం పోస్తాయని ఆయన అన్నారు.

డిప్యూటీ చైర్‌పర్సన్ కె. రోష్ని అపరంజి హెచ్ ఎస్ఎల్‌ను అభినందిస్తూ, ఒప్పందం కుదిరిన రెండు నెలల్లోనే స్టీల్ కట్టింగ్ ప్రారంభించడం ప్రశంసనీయమన్నారు. సాంకేతికతలో నిరంతర నవీకరణ, ఖచ్చితత్వం, నిబద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విశాఖపట్నం సముద్ర పారిశ్రామిక రంగ ప్రతిష్టను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు అన్ని వర్గాలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.




## ఘనంగా రంజాన్ మాసం ప్రారంభం..

✸ ముస్లిం సోదరులు నిష్ఠగా ఉపవాస దీక్ష.
✸ నెలవంక దర్శనంతో ప్రారంభమైన రంజాన్ వేడుకలు.



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:**ముస్లింలకు ఎంతో ప్రీతిపాత్రమైన రంజాన్ మాసం వచ్చేసింది. ఈ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని వారి విశ్వాసం. ముస్లింలు విధిగా రోజూ ఉపవాసం పాటించడం తో పాటు ఈ నెలంతా ఖురాన్ పఠనంతో గడుపుతారు.30 రోజులు ఉపవాస దీక్షలు ఆచరించిన వారు అల్లాహ్ అనుగ్రహం పొందుతారని వారి నమ్మకం. ఈ మాసంలో ఏదైనా పుణ్య కార్యక్రమం చేస్తే 70 రెట్ల పుణ్యఫలం లభిస్తుందని చెబుతారు. రోజూ ఉపవాసం ఆచరించే సమయంలో చెడు మాట్లాడకుండా, దురాలోచనలు దరి చేరకుండా అల్లాహ్ స్మరణలో ఉండాలని, సర్వేంద్రియాలు అదుపులో ఉంచుకోవాలని మత పెద్దలు సూచిస్తున్నారు. ఈ క్రమంలో సీలేరు మసీదులో ఘనంగా రంజాన్ మాసం ప్రారంభం అయింది. ముస్లిం సోదరులందరూ ఒక కలయికపై మసీదుకు వెళ్లి రెండు పూటలా ప్రత్యేక ప్రార్ధనను చేపడుతున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.అలాగే క్రైస్తవులు ఈస్టర్ పండగ సందర్భంగా ఉపవాస ప్రార్థనలు కూడా ప్రారంభం కావడంతో చర్చిలకు వెళ్లే మతస్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలను ప్రారంభించారు. సీలేరులో పలు చర్చిల్లో ఈ ప్రార్థనను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉంటూ సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీంతో ముస్లింలు, క్రైస్తవులు పండగలు జరుగుతుండడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ గ్రామంలో శ్రీ సీతారాముల కమ్యూనిటీ హాలు వద్ద ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీర్ల రమేష్, గొర్లె, బర్శయ్య. రీమల. తిరుమలేష్, గడుతూరి.గిరి,శెట్టి రాజు, గొర్లె.ఉమామహేశ్వర రావు, జోరంగి.దేవేంద్ర,కొండగించంగి.పండు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గంగవరం లో మైనర్ బాలికపై లైంగిక దాడి



-పరిచయస్తుడైన యువకుడు పోలీసులు అదుపులో

**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 19:**పారిశ్రామిక ప్రాంతం గాజువాక గంగవరం పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నం. 21/2026గా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 65(2) మరియు ఫోక్సోచట్టం, 2012లోని సెక్షన్ 5 ఎమ్ ఆర్/డబ్ల్యు 6 కింద కేసు నమోదు చేశామని తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం, 18 ఫిబ్రవరి 2026న సాయంత్రం 4.15 గంటల నుంచి 5.00 గంటల మధ్య పెదగంట్యాడ ప్రాంతంలోని రామాలయం వీధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబానికి పరిచయం ఉన్న సుమారు 17 సంవత్సరాలు 11 నెలల 11 రోజుల వయస్సు గల యువకుడు, బిస్కెట్లు కొనిపెడతానని చెప్పి మైనర్ బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లినట్లు తెలుస్తోందని. అనంతరం బాలికపై లైంగిక దాడి చేసి సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి వద్ద వదిలివేసి పరారైనట్లు సమాచారం.కొంతసమయం తర్వాత బాలిక తీవ్ర ఆందోళనతో ఏడుస్తుండగా కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. బాలిక తెలిపిన వివరాల ఆధారంగా తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని.

ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సాక్ష్యాలు సేకరించారు. బాధిత బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దర్యాప్తు చర్యల్లో భాగంగా నిందితుడిని 19 ఫిబ్రవరి 2026 ఉదయం 11.30 గంటలకు గంగవరం ఆటో స్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకున్నామన్నారు .




అనంతరం జ్యువినల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి బాలల సంరక్షణ కేంద్రానికి తరలించామన్నారు.

కేసు దర్యాప్తు హార్బర్ డివిజన్ ఏసీపీ పర్యవేక్షణలో, న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగుతోందని తెలిపారు.

## కుప్పరాయి వీధిలో తాగునీటి సమస్యకు పరిష్కారంగా పైప్ లైన్ పనులు ప్రారంభం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి19:**మండలంలోని లకవరపు పేట కుప్పరాయి వీధి గ్రామంలో పంచాయతీ నిధులతో చేపట్టిన వాటర్ పైప్ లైన్ పనులను సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ సత్యనారాయణ, ఉపసర్పంచ్ బురిడీ గంగాధర్, కూటమి నాయకులు, కంకిపాటి గోపాల రావు, వీరబాద్ర రావు, కంకిపాటి బొజ్జి బాబు, మండల వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు కూడా కార్యక్రమానికి హాజరై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామాభివృద్ధికి అందరూ కలిసి సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## పదో తరగతిలో శతశాతం ఫలితాలను సాధించాలి..

- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి
- విటి అగ్రహారం జెడ్‌పిహెచ్ స్కూల్ ఆకస్మిక తనిఖీ





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 19 :** పదోతరగతిలో శతశాతం ఫలితాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక విటి అగ్రహారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధన గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక వంద రోజుల శిక్షణా కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథక నిర్వహణ, పాఠశాలలోని ఇతర సమస్యలను తెలుసుకున్నారు. సుమారు 106 మంది పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కిచెన్ షెడ్ శిథిలావస్థకు చేరుకుందని, మరుగుదొడ్లు, ఆర్ఓ ప్లాంట్ మరమ్మతులు చేయాల్సి ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మార్టిన్ లూథర్ కలెక్టర్‌కు వివరించారు. పదోతరగతిలో అందరూ ఉత్తీర్ణత సాధించేవిధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## పాడేరు ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్ వసూళ్ల పర్వం: అమాయక గిరిజనులే లక్ష్యంగా దందాలు!




**పాడేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులోని ఎక్సైజ్ శాఖలో ఒక కానిస్టేబుల్ చక్రం తిప్పుతూ సాగిస్తున్న అక్రమ వసూళ్ల వ్యవహారం ఇప్పుడు స్థానికంగా సంచలనం రేపుతోంది సదరు కానిస్టేబుల్ తన అప్రతిహతమైన దందాతో పాడేరులో మాత్రమే కాకుండా గతంలో పనిచేసిన ప్రతి చోటా ఇదే తరహాలో చేతివాటం ప్రదర్శించాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ముఖ్యంగా ఎక్సైజ్ కేసుల్లో ఇరుక్కున్న అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ కేసుల నుంచి విముక్తి కల్పిస్తానని నమ్మబలికి ఒక్కో కేసు విషయంలో ఏకంగా 30 వేల నుండి 50 వేల రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నాడని బాధితులు లబోదిబోమంటున్నారు ఇంత భారీ మొత్తంలో నగదు చెల్లించలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు సదరు కానిస్టేబుల్ సాగిస్తున్న ఈ అక్రమ వసూళ్ల వ్యవహారం ఉన్నతాధికారుల అండదండలతోనే సాగుతుందా లేక వారి కళ్లుగప్పి స్వతహాగా చేస్తున్నాడా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది దీనిపై గిరిజన సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అమాయక గిరిజన ప్రజల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకొని ప్రభుత్వ జీతం తీసుకుంటూ అదనంగా వేలల్లో దందాలకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని వారు మండిపడుతున్నారు ఇలాంటి అవినీతి అధికారుల వల్ల ప్రభుత్వానికి శాఖకు చెడ్డపేరు వస్తుందని వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సదరు కానిస్టేబుల్‌పై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు కాగా ఈ మొత్తం వ్యవహారంపై బాధితులు జిల్లా కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్ సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు కలెక్టర్ కు ఫిర్యాదు అందజేసిన అనంతరం మరిన్ని ఆధారాలతో పూర్తి వివరాలను బహిర్గతం చేస్తామని బాధితులు తెలిపారు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ జరిపి గిరిజనులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే చొరవతో రహదారి భూమి పూజ.

**గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి.19 పెన్ పవర్.**గరుగుబిల్లి మండలం,తోటపల్లి పంచాయతీ,నందివానివస గ్రామం నుండి గదబవలస వరకు సుమారుగా రెండు కోట్ల 50 లక్షల నిధులతో రెండు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించేందుకు భూమి పూజ కార్యక్రమం గురువారం స్థానిక ఎంపీటీసీ మరడాన సింహాచలం ప్రారంభం చేశారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలో చాలా ఏలనాటి నుంచి తీరని సమస్యగా ఉన్న ఈ రహదారి వలన పంటలు పండించుకుని ఇంటికి తేవడానికి మరియు మార్కెట్ చేసుకోవడం కూడా రహదారి సౌకర్యం లేక చాలా కష్టనష్టాలు అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుత కూటమి ప్రభుత్వ విప్ మరియు స్థానిక శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు సంయుక్తంగా ఈ రహదారి నిర్మాణం గురించి విన్నవించుకోవడం జరిగినది.తక్షణమే ఎమ్మెల్యే తోక జగదీశ్వరి గ్రామస్తుల సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి సత్వరమే రెండు కోట్ల,యాభై లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిదన్నారు.గిజబ,గదభవలస,సింగనాపురం గ్రామాల రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేయడం జరిగిందని

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నీటి సంఘం ఉపాధ్యక్షులు



మరడాన.కృష్ణం నాయుడు,మాజీ సర్పంచ్ రెడ్డి పద్మావతి,మాజీ ఉప సర్పంచ్ కుప్పిలి లక్ష్మణ,పెద్దలు యం. రామినాయుడు,కె.ఎల్లం నాయుడు,రెడ్డి విజయ్,యం.శివున్నాయుడు.ఆర్.భాస్కర్ నాయుడు, మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

## గోపాలపట్నం కళా సేవా పీఠం ఆధ్వర్యంలో భక్తులకు అన్నవితరణ





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :** స్థానిక గోపాలపట్నం కళా సేవా పీఠం స్థాపనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విశాఖ పశ్చిమలోని గోపాలపట్నం, ప్రశాంత్ నగర్‌లో ఉన్న శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు.

పూజా కార్యక్రమాల అనంతరం సుమారు 250 మంది భక్తులకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ గత పదేళ్లుగా కళాసేవా పీఠం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పండుగలు, ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ప్రసాదాల పంపిణీ, అన్నసమారాధన కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

కరోనా మహమ్మారి సమయంలో పేదలు, బిచ్చగాళ్లు, కుష్టు వ్యాధిగ్రస్తులకు భోజన వసతి కల్పించామని, అలాగే సేవలందించిన సానిటరీ సిబ్బందికి అవసరమైన సామగ్రితో పాటు పలుమార్లు అల్పాహారం అందించామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఆర్థిక సహాయం కూడా అందించినట్లు తెలిపారు.

అదేవిధంగా శ్రీకాకుళం జిల్లా మరియు విజయవాడ ప్రాంతాల్లో వరదలు సంభవించిన సమయంలో బాధితులకు బట్టలు, బియ్యం మరియు ఆర్థిక సహాయం అందజేసినట్లు వివరించారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు, ఎం.ఎన్.వి. శ్రీనివాస్, సాలాపు శ్రీనివాసరావు, జి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఘనంగా పేతకంశెట్టి అప్పల నరసింహం 90వ జయంతి వేడుకలు



మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :** స్థానిక విశాఖ పశ్చిమ, గోపాలపట్నం కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు తండ్రి కీ.శే. పేతకంశెట్టి అప్పల నరసింహం 90వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం కేవలం జయంతి వేడుకగా మాత్రమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలతో కూడిన స్ఫూర్తిదాయక కార్యక్రమంగా నిలిచింది.

సేవా దృక్పథంతో జయంతి వేడుకలు

పేతకంశెట్టి అప్పల నరసింహం సమాజ సేవకు అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. వారి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ జయంతి వేడుకల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం విశేషం. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రక్తదానం వంటి మహోన్నత సేవా కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యతను చాటడం, యువతలో సేవా భావాన్ని పెంపొందించడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశ్యంగా కనిపించింది.

ఎమ్మెల్యే గణబాబు సందేశం..

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. “జనసేవే జనార్దన సేవ” అన్న నినాదంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ తండ్రి చూపిన సేవా మార్గాన్ని అనుసరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరానికి హాజరైన ముఖ్య అతిథులు..

ఈ కార్యక్రమానికి విశాఖ నగర మేయర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా అపోలో హాస్పిటల్స్ సీఈఓ కృష్ణ ప్రసాద్, టీడీపీ యువనేత మౌర్య సింహ, జనసేన నాయకురాలు అంగ దుర్గ ప్రశాంతి, సూపరింటెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ నుంచి యూనిట్ హెడ్ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ నారాయణ హాజరయ్యారు. కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, శరగడం రాజశేఖర్, గల్లా చిన్న, 89 వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయకుమార్, దాడి సురేష్, పెప్సీ రమణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాజకీయ సామాజిక సమన్వయం..

ఈ వేడుకలు రాజకీయ నాయకులు, కార్పొరేట్ ప్రతినిధులు, సామాజిక సంఘాలు, యువత ఒకే వేదికపైకి రావడానికి కారణమయ్యాయి. ఇది కేవలం రాజకీయ కార్యక్రమం కాకుండా సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ముఖ్యంగా రక్తదానం ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడే సేవా కార్యక్రమాన్ని జయంతి వేడుకలతో అనుసంధానించడం ప్రశంసనీయం.

మొత్తానికి, పేతకంశెట్టి అప్పల నరసింహం 90వ జయంతి వేడుకలు విశాఖలో సేవా స్ఫూర్తికి నాంది పలికాయి. రక్తదానం వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేసే విధంగా నిర్వహించిన ఈ వేడుకలు ప్రజల్లో సేవా భావాన్ని మరింతగా పెంపొందించాయి.

ఈ కార్యక్రమం భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.




## జీకేవీధి కానిస్టేబుల్‌కు ఉత్తమ అవార్డు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:**అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్తవీధికి చెందిన కానిస్టేబుల్ ధనుంజయకు ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ అవార్డు లభించింది. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. జీకేవీధి పోలీస్ స్టేషన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ధనుంజయను 2025 సంవత్సరానికి ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎంపిక చేశారు. విధుల్లో క్రమశిక్షణ, సమర్థతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా సేవలు అందిస్తున్నందుకు ఆయనను అధికారులు అభినందించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ అమిత్ బర్దర్ అవార్డును అందజేసి, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జీకేవీధి పోలీసు అధికారులు ధనుంజయను అభినందించారు.

## విద్యార్థుల నడుమ చత్రపతి శివాజీ జయంతి వేడుకలు.

- జయహో చత్రపతి శివాజీ మహారాజ్ అంటూ మార్మోగిన బి వి కె పాఠశాల ఆవరణం



**హుకుంపేట పెన్ పవర్. ఫిబ్రవరి 19:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట మండల కేంద్రంలో గల బి వి కే. పాఠశాలలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె అప్పలకొండ మాట్లాడుతూ చత్రపతి శివాజీ హిందూ ధర్మం కోసం,స్వరాజ్య స్థాపన కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు అలాగే అలాగే శివాజీ జీవిత మనందరికీ స్ఫూర్తిదాయకమని దేశభక్తి, ఆత్మవిశ్వాసం, ధైర్యం మరియు స్త్రీలను గౌరవించడం వంటి విలువలను ఆయన జీవితం నుండి నేర్చుకోవాలని అయన అన్నారు

ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ సంధ్యారాణి ఒక సూక్తిని చెప్పి లక్ష్యం బలమైనదైతే ఎంత పెద్ద పర్వతారోహణ అయినా చిన్నదిగా కనిపిస్తుంది ఈ సందర్భంగా ఆమె అన్నారు అలాగే పాఠశాల లోని చిన్నారులు శివాజీ జయంతి పురస్కరించుకొని కొన్ని నినాదాలు చేసి నివాళులు అర్పించారు

# సింహాచలంలో శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ జీర్ణోద్ధరణకు శ్రీకారం





**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :** సింహగిరి క్షేత్రపాలకుల ఉపాలయమైన గంగధార మార్గంలోని శ్రీ బాలసుందరి సమేత త్రిపురాంతక స్వామివారి ఆలయంలో పురాతన ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమైంది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆదేశానుసారం, వారి పర్యవేక్షణలో ఈ పుణ్యకార్యానికి శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచే ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రోక్షణ తదితర శుద్ధి కర్మలు నిర్వహించగా, అనంతరం వాస్తు పూజ, వాస్తు హోమం, జీర్ణోద్ధారణాంగ హోమాలను ఆగమశాస్త్ర పద్ధతిలో భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. కార్యక్రమ ముగింపులో శాస్త్రోక్త పూర్ణాహుతితో స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వెలవపల్లి వెంకట రమణమూర్తి శర్మ, కాళ్ళకూరి సుబ్రమణ్య శర్మ, సంతోష్ శర్మ, శ్రీ శివాచార్య, ప్రణవ్ శర్మలు ఆగమశాస్త్ర నియమాలకు అనుగుణంగా నిర్వహించారు.

సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ధ్వజస్తంభ పునరుద్ధరణ పనులకు ప్రముఖ దాత ఎం.వి. రాఘవరావు తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారు. ఆలయ ప్రాచీన వైభవాన్ని కాపాడుతూ, భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా ఈ పనులు కొనసాగుతున్నాయని దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ/సి) రామరాజు, ఏఈ రవిరాజు తదితరులు పాల్గొని పనులను సమీక్షించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ధ్వజస్తంభం ఆలయ మహిమకు ప్రతీకగా నిలిచే పవిత్ర చిహ్నం కావడంతో, జీర్ణోద్ధరణ అనంతరం ఆలయ క్షేత్రశోభ మరింత పెరుగుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మంప ఎస్సైని సన్మానించిన మండల వైసీపీ నేతలు



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 19:**మండలంలోని మంప నూతన ఎస్సై సీదరి శ్రీనివాస్ ని మండల వైసీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి, దుస్సాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, మండల వైసీపీ ఉపాధ్యక్షులు నర్శి కృష్ణ , సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు ముసిలి నాయుడు, చీడిపాలెం సర్పంచ్ సోమన్నదొర, మండల కార్యదర్శి పెట్ల గాంధీ, పెసా సెక్రటరీ ఉల్లిరాంమూర్తి, బూదరాళ్ళ ఎంపిటిసి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణంతో కాఫీ తోటలకు నష్టం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:**రహదారి నిర్మాణంతో తమ కాఫీ తోటలు నష్టపోతున్నామని మండలంలోని మంగళపాలెం, గూనలంక గ్రామానికి చెందిన గిరిజనులు తెలిపారు. రహదారి పనులు చేపడుతున్న జెసీబీ వద్ద గురువారం నిరసన తెలిపారు. మంగళపాలెం గ్రామం నుంచి గూనలంకల గ్రామం వరకు రోడు నిర్మాణానికి తాము అడ్డు చెప్పడం లేదని అయితే అక్కడ కాఫీ తోటల మీదుగా రోడ్డు చేపడుతుండడంతో మొక్కలు నాశనం అవుతున్నాయని తెలిపారు. సంబంధిత కాఫీ రైతులకు కనీసం అడగకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు కాఫీ మొక్కలు పోయినందుకు నష్టం పరిహారం చెల్లించాలని కోరారు.

## నేడు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి19:**
ఈనెల 20 శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ పాడేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వేణుగోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు మార్పు చేర్పుల కారణంగా కాకరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాకరపాడు, ఐటీడీఏ కాలనీ, సింగవరం, రాజేంద్రపాలెం, కొయ్యూరు, మరియు చింతవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ, పాడేరు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , పి.వేణుగోపాల్ తెలియజేశారు. అనివార్యమైన ఈ అంతరాయాన్ని గుర్తించి విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## సర్పంచ్ చొరవతో పంచాయతీ మొదటి భవనం నిర్మాణం





- స్వాతంత్ర్య అనంతరం జర్రెలలో ఎట్టకేలకు తీరనున్న పంచాయతీ భవనం సమస్యలు.
- సర్పంచ్ బోర్గం భాగ్యవతి కృషిని అభినందిస్తున్నా పంచాయతీ వాసులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 19.** మండలంలోని జర్రెల పంచాయితీ కేంద్రంలో 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న పంచాయతీ భవనం శరవేగంగా నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధపడుతుంది. వివరాల ప్రకారం.. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు పంచాయతీ కేంద్రంలో పూర్తిస్థాయి పంచాయతీ భవనములేక పరాయి పంచన పంచాయితీ కార్యక్రమాలు నిర్వహించేవారు. పంచాయితీ సర్పంచ్ గా ఎన్నికైన నాటి నుండి నేటి వరకు పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ బోర్గం భాగ్యవతి కృషి ఎనలేనిదిగా అభివర్ణించవచ్చును. పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టాలని ఎంతో కృషితో పట్టుదలతో జిల్లా కలెక్టర్ల చుట్టూ తిరుగుతూ తాను అనుకున్నది ఈరోజు సాధించిందని చెప్పక తప్పటం తప్పదు. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు పలుమార్లు పంచాయతీ భవనం కొరకు నిధులు మంజూరు చేయాలని కోరడంతో ఎట్టకేలకు పంచాయతీ భవనం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ పది లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతూ ప్రారంభానికి సిద్ధపడుతుంది. పంచాయతీ భవనం పూర్తయి ప్రారంభం అయితే పంచాయతీ ప్రజలు కష్టాలు తో పాటు పంచాయతీ ప్రజలతో సమావేశాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఏది ఏమైనాప్పటికీ పంచాయతీ సర్పంచ్ బోర్గం భాగ్యవతి కృషి పట్టుదలతో నేడు ప్రారంభానికి పంచాయతీ భవనం సిద్ధపడుతుంది. పంచాయతీ భవనం ప్రారంభం సిద్ధపడుతుండడంతో పంచాయతీ ప్రజలు సర్పంచ్ భాగ్యవతి కృషికి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు రింతాడ పాఠశాల విద్యార్థి ఎంపిక




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:**రాష్ట్రస్థాయిలో జరగనున్న చదరంగం పోటీలకు గూడెం కొత్త వీధి మండలం రింతాడ ఎంపీయుపి పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ ప్రసాద్ గురువారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. స్థానిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రసన్నకుమార్ అనే విద్యార్థి ఇటీవల పాడేరులో జరిగిన అండర్ 13 చదరంగం పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. తిరుపతిలో జరగనున్న రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి అద్భుత ప్రదర్శనకు ప్రత్యేక శిక్షణ అందించిన పాఠశాల పీడీ పసుపులేటి జ్ఞానేశ్వర్రావును ప్రధాన ఉపాధ్యాయులతో పాటు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

## వైసిపి కార్యకర్తకు పరామర్శించిన అరకు మాజీ ఎమ్మెల్యే



కష్ట సమయంలో పార్టీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చిన చెట్టి పాల్గుణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 19.**మండలంలో గల దారేల పంచాయతీ పెద్దపేట గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త కొర్ర గౌరీశంకర్ ను అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. గౌరీ శంకర్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని విషయం తెలుసుకుని గురువారం పెద్దపేట గ్రామంకు వెళ్లి గౌరీ శంకర్ కు మండల పార్టీ నాయకులతో కలిసి అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ గౌరీ శంకర్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఏ ఇబ్బంది ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కుటుంబానికి భరోసా కల్పించారు. అనంతరం అదే గ్రామ పంచాయతీకు చెందిన పేటమాలిపుట్టు గ్రామంలో వంతాల వారి శుక్లా స్నానం సందర్భంగా వంతల రాము కుమారుడు భాస్కరరావు వారి కుటుంబ సభ్యులు ఆహ్వానం మేరకు గ్రామంలో చేరుకుని చిరంజీవి మౌనికకు ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు వెంగడ రమేష్, ఏనుగురాయి సర్పంచ్ శిరగం నర్సింగరావు, నాయకులు చటారి కృష్ణారావు, బాక సింహాచలం, జయదేవ్, దేవ, సాధురం, హనుమంత్, పులి రాజు, పాపారావు, పిత్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో 120 బాలికలకు విద్యా కిట్ల పంపిణీ

- ఘనంగా కృష్ణపురం కేజీబీవీలో కార్యక్రమం



**పద్మశాభం, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :**పద్మశాభం మండలం కృష్ణపురం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీ వీ)లో చదువుతున్న 6వ నుండి 8వ తరగతి వరకు ఉన్న 120 మంది బాలికలకు నాంది ఫౌండేషన్ సౌజన్యంతో విద్యా కిట్లు పంపిణీ చేశారు.ప్రతి విద్యార్థినికి బ్యాగ్, పుస్తకాలు, పెన్సిల్స్, టీ-షర్ట్, షూస్ మరియు ఇతర అవసరమైన విద్యాసామగ్రితో కూడిన కిట్‌ను అందజేశారు. ఈ కిట్లను మండల విద్యాధికా రులు రమణ, బాబులాల్ విద్యార్థినులకు అందజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల బాలికలకు విద్యా పరంగా ప్రోత్సాహం అందించడంలో నాంది ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీ యమని తెలిపారు. ఈ కిట్లు విద్యార్థినుల చదువులో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ ప్రతినిధి ఝాన్సీ, ప్రధానోపాధ్యాయురాలు గ్రేస్ లిల్లీ, ఉపాధ్యాయులు మరియు పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభ రితంగా సాగింది.

## దొడ్డికొండ యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు పాడి కృష్ణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:**అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్డికొండ గ్రామ యువతకు చింతపల్లి మండలం ఎర్రబొమ్మలు పంచాయతీ ఎర్నాపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు పాడి కృష్ణ స్వచ్ఛందంగా వాలీబాల్ కిట్ అందజేశారు.గ్రామానికి చెందిన పాత్రికేయుడు, పేసా కమిటీ కార్యదర్శి మాదిరి చంటిబాబు విజ్ఞప్తి మేరకు యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కిట్ పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామ యువకులు క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ అలవర్చుకోవాలని పాడి కృష్ణ సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పూసర్ల భాగ్య, గ్రామస్తులు పనసల చిట్టిబాబు (విలేఖరి), వసుపరి బాబా కిరణ్ (న్యాయవాది), గ్రామ యువత సాగిన రాజేష్, సాగిన మధు, రాము, సాగిన బాలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ యువత పాడి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## మల్కాపురం పెద్దింటి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



**ములగాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :**విశాఖపట్నం నగరంలోని 61వ వార్డు మల్కాపురం గ్రామ దేవత అయిన పెద్దింటి అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు భక్తిశ్ర ద్ధలతో నిర్వహించబడ్డాయి. పాల్గొనమాసం సందర్భంగా ఆలయ అర్చకులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమా నికి వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి సోమేష్, ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ ఎం. అప్పారావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సమత యాదవ్ తదితరులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు.
ఈ సందర్భంగా ఎం. అప్పారావు మరియు సమత యాదవ్ సహకారంతో భక్తులకు అన్నప్ర సాదం పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది.

## అపరిచితులను గ్రామాల్లోకి రానీయవద్దు: సీఐ సుధాకర్




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి19:** గ్రామాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని గూడెం కొత్తవీధి సీఐ బి . సుధాకర్ సూచించారు.గూడెం కొత్తవీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ పరిధిలోని నేలజర్త, దుప్పులవాడ పంచాయతీ వలసగడ్డ గ్రామాల్లో గురువారం సీఐ పర్యటించి గిరిజనులతో సమావేశమయ్యారు. ఇటీవల గ్రామాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో, గ్రామాల్లోకి వచ్చే అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే గంజాయి సాగు, రవాణా కారణంగా బయట వ్యక్తులు ఆర్థికంగా లాభపడుతుండగా, స్థానిక గిరిజనులకు మాత్రం కేసులు మిగులుతున్నాయని సీఐ సుధాకర్ పేర్కొన్నారు. గ్రామాల్లో గంజాయి సాగు, రవాణాను పూర్తిగా నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని, శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ యాసీన్ తదితర పోలీసులు పాల్గొన్నారు.

## గంగిరి గణేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం: చీఫ్ ఇంజనీర్ కె.వి.రాజారావు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:** సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కాంట్రాక్ట్ కార్మికుడు గంగిరి గణేష్ కుటుంబాన్ని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కె.వి.రాజారావు తెలిపారు. గురువారం గంగిరి గణేష్ కుటుంబాన్ని పరామర్శించిన రాజారావు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. చేతికందిన కుమారుడి మృతి బాధాకరమని, ఆ లోటును తీర్చలేమని పేర్కొన్నారు. అయితే ఏపీ జెన్కో పరంగా గణేష్ కుటుంబానికి రావలసిన అన్ని ప్రయోజనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.సాధ్యమైనంత త్వరగా ఎక్స్‌గ్రేషియా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని, కుటుంబానికి ఎప్పుడైనా అవసరమైన సహాయం అందించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా గంగిరి గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఈలు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మృతి చెందిన గంగిరి గణేష్‌కు సీఐటీయూ నాయకులు గురువారం సంతాపం తెలిపారు. సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు సుభాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మికులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి. లక్ష్మణ్, ఈ. విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


## త్వరలోనే డుడుమ బస్సు షెల్టర్ ప్రారంభం

- వైసీపీ నేత వి వి ఎన్ మూర్తి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 19.**మండలంలో గల వనగుమ్మ పంచాయతీ పర్యాటక ప్రాంతం డుడుమ డామ్ సమీపన జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న బస్సు షెల్టర్ ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జెవివిఎన్ మూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సు షెల్టర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టిన ఈ బస్సు షెల్టర్ పెయింటింగ్స్ పనులు మిగిలి ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేసి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర చేతుల మీదగా ప్రారంభించబోతున్నట్లు ఆయన అన్నారు. ఇక్కడ కొచ్చే పర్యాటకులు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో ఘనంగా మెగా జాబ్ ఫెయిర్ ఉద్యోగ అవకాశాలు కల్పినలో 70 కంపెనీలు.





-ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కై యువత ఆశాభావం

**గాజువాక పెన్ పవర్, ఫిబ్రవరి 19:**విశాఖపట్నం దువ్వాడ విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్ కళాశాలలో మెగా జాబ్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. ఉద్యోగావకాశాల కల్పనకు, పరిశ్రమలతో పరస్పర అవగాహన పెంపొందించడానికి ఉత్తమ వేదికగా నిలిచింది.
ఈ మెగా జాబ్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. సుమారు 9,000 మంది విద్యార్థులు మరియు ఉద్యోగార్థులు కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రిక్రూట్మెంట్ డ్రైవ్‌కు హాజరయ్యారు. ఇది యువతలో ఉన్న ఉద్యోగావకాశాలపై యువత ఆసక్తిని చూపడం విశేషం.
కోర్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తయారీ, బ్యాంకింగ్, ఫార్మాస్యూటికల్స్, లాజిస్టిక్స్ మరియు సేవల రంగాలకు చెందిన సుమారు 70 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొన్నాయి. ఈ సంస్థలు కలిపి సుమారు 4,650 ఖాళీలను ప్రకటించాయి, తద్వారా అభ్యర్థులకు విభిన్న రంగాలలో ఉపాధి అవకాశాలు లభించాయి.
ఇంజినీరింగ్ మరియు ఇతర విభాగాలకు చెందిన అభ్యర్థులు అప్టిట్యూడ్ పరీక్షలు, టెక్నికల్ ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్లు మరియు హెచ్ఆర్ రౌండ్లలో చురుకుగా పాల్గొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు ఈ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలిచింది.
కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినందుకు విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ సంతృప్తి వ్యక్తం చేసింది. పరిశ్రమవిద్యా సంస్థల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం, విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, డీన్ ప్లేస్‌మెంట్స్ డా. బి. ప్రసాద్ పాల్గొన్న కంపెనీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు, అధ్యాపకులు మరియు విద్యార్థి వాలంటీర్లను అభినందించారు.
ఈ మెగా జాబ్ ఫెయిర్ విజ్ఞాన్ సంస్థ యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో, నైపుణ్యాభివృద్ధిలో ముందంజలో ఉన్నదనడానికి మరో నిదర్శనంగా నిలిచింది.

## నీళ్ల కోసం రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం



ఎర్రవరం గ్రామంలో మంచినీటి కష్టాలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19**: గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని ఎర్రవరం గ్రామంలో నివసించే 80 కుటుంబాలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గ్రామంలోని ప్రభుత్వ మంచినీటి పథకం తరచుగా మరమ్మతులకు గురవ్వడం వలన, స్థానికులు రోజువారీ నీటిని పొందడానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటకు వెళ్ళవలసి వస్తోంది.స్థానికులు మాట్లాడుతూ, " గత రెండు నెలలుగా ఈ పథకం పడకేయడంతో పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం. అయినా పరిష్కారం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ వాసుల ఆరోగ్యానికి ఇది పెద్ద ముప్పుగా మారుతోందని, చిన్నారులు, వృద్ధులు కూడా ప్రతిరోజూ ఇబ్బందులు భోగుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి, మంచినీటి పథకాన్ని మరమ్మతు చేసి, స్వచ్ఛమైన, సరైన నీటిని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలిని కోరుతున్నారు.

## విశాఖలో కీ.శే. పేతకంశెట్టి అప్పల నరసింహం





**ఘనంగా 90వ జయంతి వేడుకలు నిర్వహణ**

**1062 మంది స్వచ్ఛంద రక్తదానం**

**రక్తదాతలకు ప్రభుత్వ విప్ గణబాబు కృతజ్ఞతలు**

**ములగాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 19 :**విశాఖపట్నం నగరంలోని గోపాలపట్నంలో ఉన్న విశాఖ పశ్చిమ కార్యాలయంలో కీ.శే. పేతకంశె ట్టి అప్పల నరసింహం 90వ జయంతి వేడుక లు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్ర మాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.జయంతి సంద ర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరా నికి విశేష స్పందన లభించింది. కూటమి నా యకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు విద్యార్థులు కలిపి మొత్తం 1062 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.
ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, రక్తదానం మహాదానం అని పేర్కొంటూ, మెగా రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సమాజాని కి సేవ చేయాలనే తండ్రి ఆశయాలను ముందు కు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆయన అన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విశాఖ నగర మేయర్ శ్రీనివాసరావు హాజరై రక్తదాతలను అభినందించారు. ప్రత్యేక అతిథులుగా అపోలో హాస్పిటల్ సీఈఓ కృష్ణ ప్రసాద్ టీడీపీ యువనేత మౌర్య సింహ , జనసేన నాయకురాలు అంగ దుర్గ ప్రశాంతి , సూపరింటెండెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.
అలాగే కోరమండల్ సంస్థ యూనిట్ హెడ్ సిహెచ్. శ్రీనివాస్ , అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కే .వి.వి.వై.ఎస్ నారాయణ, కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్ బొమ్మిడి రమణ,శరగడం రాజ శేఖర్ గల్లా చిన్న తదిత రులు హాజరై కార్య క్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ జయంతి వేడుకలు సేవా స్ఫూర్తిని ప్రతిబిం బిస్తూ విశాఖలో ఒక స్ఫూర్తిదాయక కార్యక్ర మంగా నిలిచాయి.

## పార్టీ బలోపేతానికై సమీక్ష సమావేశం.



**అరకు పార్లమెంటు పరిధి నియోజకవర్గాలపై సమీక్ష సమావేశం.**

**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 19 పెన్ పవర్.**అరకు పార్లమెంట్‌కు సంబంధించిన నియోజకవర్గ ఎమ్మెల్యేలు,ఇన్‌ఛార్జిలతో గురువారం నాడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి,అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజావతితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు హాజరయ్యారు.సమావేశంలో అరకు పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల అభివృద్ధి అంశాలు,గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుతెన్నులు,ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని,ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా సమన్వయంతో పనిచేయాలని నేతలు సూచించారు.పార్టీని బలోపేతం చేయడం,గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయివరకు నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఈ సమీక్ష సమావేశంలో పిలుపునిచ్చారు.ప్రజల సమస్యలపై నిరంతరం దృష్టి పెట్టి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు.

## ఉపాధ్యాయుడు పొట్టన్న భౌతిక దేహాన్ని నివాళులర్పించిన డాక్టర్ సురేష్ కుమార్



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 19.** ముంచంగిపుట్టు మండలంలోని సొలగంపుట్టు గ్రామానికి చెందిన జర్సింగి పొట్టన్న మాస్టారు గురుకులం సొసైటీలో ఏపిటిడబ్ల్యూ ఆర్ ఎస్ బాలురు పాఠశాల, జి మాడుగులలో విధులు నిర్వహిస్తు దాదాపుగా 20ఏళ్లుగా సేవలు అందించారు. పొట్టన్న మాస్టారు బుధవారం రాత్రి 12 గంటలకు విశాఖపట్నం కేజీహెచ్ లో బ్రెయిన్ స్టోక్ తో చికిత్స పొందుతూ మరణించారని తెలిసి వైఎస్ఆర్సీపీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ తెడబారికి సురేష్ కుమార్ స్వగ్రామమైన సొలగంపుట్టు గ్రామంలో చేరుకొని జర్సింగి పొట్టన్న భౌతిక దేహాన్ని పూల మాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కలిపించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. మాస్టారు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మాస్టారు మరణంతో శోక సంద్రంలో సొలగంపుట్టు మునిగిపోయింది. పొట్టన్న భౌతిక దేహాన్ని పలువురు ఉపాధ్యాయులు పాల్గొని నివాళులర్పించారు.

## మై టిడిపి యాప్ పోస్టర్ ఆవిష్కరణ

టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 19.**ముంచంగిపుట్టు మండల కేంద్రంలో మై టిడిపి యాప్ పోస్టర్ ఆవిష్కరణ మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసమ్మ మాట్లాడుతూ..తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్ర రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు, అరకు నియోజక వర్గం తెలుగు దేశం పార్టీ ఇంచార్జి ఆర్టీసీ రీజనల్ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యరి దొన్ను దొర ఆదేశాల మేరకు ముంచంగిపుట్టు మండలంలో మై టిడిపి యాప్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగిందన్నారు. తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు అందరు యాప్ డౌన్లోడ్ చేసుకుని చేస్తున్నా సామాజిక సేవ, క్యాడర్ మీటింగ్, ప్రభుత్వ ప్రచారం, సమావేశాలు, పార్టీ కార్యకలపాలు మొదలయిన కార్యక్రమం చేసిన ఫొటోలు తీసి మై టిడిపి యాప్ లో పంపించాలని తెలియ జేశారు.
ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె జాగత్రాయ్, పిఏసిఎస్ చైర్మన్ ఎస్ బాబూజీ, మాజీ అరకుపార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పి శాస్త్రిబాబు, మాజీ మండల అధ్యక్షులు కె బలరాం, క్లస్టర్ ఇంచార్జ్ ఏం చిన్ని, మాజీ మండల అధ్యక్షుడు రనసింగి నీలకంఠం పాత్రో, నాయకులు ముఖి సురేష్ కుమార్, ఏడే చిట్టిబాబు, కుడేలి నూకరాజు, పాడి సుమన్, నరసింగరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


# 48 వార్డులో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్న గంకల కవిత అప్పారావు యాదవ్

- ఏ ఎస్ ఆర్ నగర్ నూతన మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన గంకల
- ప్రజా సమస్యల పరిష్కారమే గుడ్ మార్నింగ్ గంకల

**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 19:**జీవీఎంసీ 48వ వార్డులో వార్డు ప్రజలకు 48వ వార్డు కార్పొరేటర్,జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ అభివృద్ధి పనులను నేరుగా దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు.గుడ్ మార్నింగ్ గంకల పేరుతో వార్డులో సమస్యలను నేరుగా ప్రజలు వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారం చూపుతున్నారు.ఇందులో భాగంగా గురువారం వార్డులో ఏ ఎస్ ఆర్ నగర్ లో మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనులను నేరుగా పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.పనులను పరిశీలించి అధికారులకు కాంట్రాక్టర్ కు నాణ్యతలో లోపం లేకుండా నిర్మాణ పనులు చేయాలని సూచనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభివృద్ధి పనులను పరిశీలించారు.వార్డులో అధికారులు,ప్రజలతో కలిసి పరుగులు పెడుతూ అభివృద్ధి పనులు పరిశీలించారు.ఈ పర్యటనలో భాగంగా ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48వ వార్డులో చేపడుతున్న గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన వినతులను పరిశీలించి జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి జీవీఎంసీ మేయర్,కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వార్డు ప్రజల సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా వార్డులో గల ఏ ఎస్ ఆర్ నగర్ లో మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.భవిష్యత్తులో వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని,వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని గంకల కవితా అప్పారావు యాదవ్ పేర్కొన్నారు.గుడ్ మార్నింగ్ గంకలతో వందల సమస్యల పరిష్కారం అయ్యాయని గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు.ఇందులో భాగంగా వార్డు అంతటా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రజల నుంచి పలు వినతలను స్వీకరించి తక్షణమే ఫోన్ లో అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు.వార్డు అభివృద్ధికు నిరంతరం అహర్నిశలు కృషి చేస్తున్న కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు యాదవ్ కు వార్డు ప్రజలు హర్షధ్వనులు తెలిపారు.









## అవినీతి నిరూపించకపోతే మీ కాళ్లు పట్టుకుని క్షమాపణ అడుగుతా



- నిరూపిస్తే మీరు దోచిన డబ్బు ప్రభుత్వానికి కడతారా.
- నేను సిద్ధం మీరు సిద్ధమా.
- జ్యోతుల నెహ్రూ,నవీన్ లకు సవాల్ విసిరిన పాఠంశెట్టి సూర్యచంద్ర.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 19:** నియోజకవర్గంలో మీరు చేసిన అవినీతి నిరూపించకపోతే మీ కాళ్లు పట్టుకుని క్షమాపణ అడుగుతాను, నిరూపిస్తే మీరు దోసిన డబ్బు ప్రభుత్వానికి కడతారా అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ లకు నేను సిద్ధం మీరు సిద్ధమా అని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర సవాల్ విసిరారు. గురువారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జగ్గంపేటలో ఎన్నికల ప్రచారసభలో జగ్గంపేట నియోజకవర్గంలో విపరీతమైన మట్టి ఇసుక తోలకాలు జరిగాయని అవినీతి అనకొండలుగా మారి ప్రజాధనం దోచుకు తిన్నారని చెప్పడం జరిగిందన్నారు. అవినీతిపై ప్రశ్నించాలని,భయపడకుండా ధైర్యంగా అవినీతి చేసే వారిపై పోరాడి చేసిన అవినీతిని అందరికీ తెలిసే విధంగా ప్రజలందరూ తమ గళం వినిపించాలని తెలిపిన వీడియోని చూపిస్తూ నాటి ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి తేడా ఎక్కడ అని జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ లను సూర్యచంద్ర ప్రశ్నించారు. ఈ రెండు సంవత్సరాల్లోనూ జగ్గంపేట నియోజకవర్గంలో మట్టి, ఇసుక అక్రమ రవాణాలో 200 కోట్లు పైనే అవినీతి జరిగిందని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని నిరూపించ లేకపోతే జగ్గంపేట నడిబొడ్డున మీరు ఏర్పాటు చేసిన సమావేశంలో నేను మీ కాళ్ళ పట్టుకొని క్షమాపణ చెప్పి రాజకీయాల నుండి తప్పుకుంటానని, మీరు చేసిన అవినీతి నిరూపించినట్లయితే మీరు దోచుకున్న ప్రజాధనాన్ని ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు.రెవెన్యూ మైనింగ్ డిపార్ట్మెంట్ లతో మామిడాడ, కృష్ణవరం, గండేపల్లి, మురారి, నాయకంపల్లి, ఎన్ టి రాజాపురం, రంపయర్రంపాలెం, వీరలంకపల్లి ,బావాజీపేట, సూదికొండ, వేలంక ఇంకా అనేక గ్రామాలలో మట్టి, ఇసుక ఓవర్ లోడ్ లారీలు ప్రభుత్వ టోల్గేట్ లోకి వెళ్లకుండా బూరుగుపూడి కృష్ణవరం మధ్యలో పోలవరం, పుష్కర కాలువలనుండి రాత్రి పగలు తోలుతున్న మీ పర్సనల్ టోల్గేట్ ఆదాయం, ఏలేరులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గ్రామాలలో ఇసుక తీసిన అన్ని ప్రాంతాలను స్వయంగా చూపించి అవినీతి నిరూపించడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. టైము డేటు ప్లేస్ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ,జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ నిర్ణయించుకుని తెలియచేయాలని పాటంశెట్టి సూర్యచంద్ర మీడియా ద్వారా కోరారు.

## పని ఒత్తిడి తగ్గించండి వీఆర్వోలు వినతి



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 19:**పని ఒత్తిడి తగ్గించాలంటూ స్థానిక తాసిల్దార్ శ్రీనివాస్ కు గురువారం వీఆర్వో సంఘం అందించారు. ఈ సందర్భంగా వీఆర్వో సుబ్బారావు మాట్లాడుతూ జేఏసీ రాష్ట్ర పిలుపుమేరకు మెమొరం ఇవ్వడం జరుగుతుంది జరిగిందన్నారు. రీ సర్వే, సర్వేలు డ్యూటీలో ఉన్న విఆర్వోలకు అటెండెన్స్ సచివాలయంలోకి వెళ్లి డ్యూటీకి వెళ్లే పరిస్థితి ఎలా ఉందని ఎలా అయితే విఆర్వోలు విధులకు భారంగా ఉంటుందన్నారు. అథర్స్ ద్వారా ఇస్తే డ్యూటీలో ఉండి అటెండెన్స్ వేయవచ్చు అన్నారు. అంతేకాకుండా పని భారం అధికమవుతుందని జి ఎస్ డబ్ల్యు, మరియు రెవెన్యూ వర్కులు ఒకేసారి పనిచేయడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకుని పని భారం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీరి వెంట వీఆర్ఏలు సర్వేయర్లు వీఆర్వోలు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల కాల్స్ మెసేజ్లకు స్పందించవద్దు



**జికేవీధి ఎస్సై సురేష్ సూచన**

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 19:**అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ మెసేజ్ లకు స్పందించవద్దని గూడెం కొత్త వీధి ఎస్ఐ సురేష్ సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నెరగాళ్లు గ్రామీణ ప్రాంతాల వారికి టార్గెట్ చేశారని తెలిపారు. ఎవరైనా కాల్ చేసి డబ్బులు అడిగినా, ఓటిపి అడిగినా స్పందించవద్దని పేర్కొన్నారు.ముఖ్యంగా మీ అకౌంట్ కి కొంత అమౌంట్ పంపించి తిరిగి పంపాలని అడిగినా పంపొద్దని ఆయన సూచించారు. సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్.



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 19;**మండలంలోని పెద్దపళ్ళ,నర్సిపూడి గ్రామాలలో మృతుల కుటుంబాలను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. పెద్దపళ్ళ గ్రామానికి చెందిన సీనియర్ జనసేన పార్టీ నాయకుడు గారపాటి త్రిమూర్తులు తండ్రి చిన్న చంటయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి పితృవియోగంతో ఉన్న గారపాటి త్రిమూర్తులను పరామర్శించి ఓదార్చారు. అలాగే నర్సిపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన లింగాల సూర్యనారాయణ కుటుంబ సభ్యులను బండారు శ్రీనివాస్ పరామర్శించారు. బండారు శ్రీనివాస్ వెంట నల్లా వెంకన్న,దున్నే స్వామినాయుడు, తోట వెంకటేశ్వర్లు,ఉన్నమట్ల బాలకృష్ణ,బైరిశెట్టి రాంబాబు, దేశభక్తుల సత్యనారాయణ, మాకి రెడ్డి బాబి, సిరిగినీడి పట్టాభి, గుత్తుల సురేష్,ఉండమట్ల దుర్గా ప్రసాద్, లింగాల నారయ్య, లింగాల గోవింద్, లింగాల పెద్ద, ఉండమట్ల అప్పారావు, ఎలుగుబంట్ల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి అప్పారావుకు మురళీకృష్ణంరాజు పరామర్శ.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఫిబ్రవరి 19:**శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు కొండపల్లి అప్పారావును ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణ రాజు గురువారం పలకరించారు.కొండపల్లి అప్పారావు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆరోగ్యం బాగోలేని కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు గురువారం అప్పారావును పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్,వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు ,తాటిపాక కృష్ణ ,వార్డు నెంబర్ గంపల సత్తిబాబు, పలివెల కొండలరావు,ఎం ఎస్,కొల్లు గణేష్ ,పలివెల ఈశ్వర్ రావు ,గంపల జయ గంగరాజు,కోలా తాతబాబు ,బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య ,జువ్వల రాజు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ బోండా




**కూర్మాన పాలెం: పెన్ పవర్, ఫిబ్రవరి 19:**మహావిశాఖ నగరపాలక సంస్థ 87వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నాయి . వార్డ్ ప్రధాన రోడ్డు కి అనుకొని ఫుట్ పాత్ పనులను రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం పాల్గొని పరిశీలించారు. వార్డులో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అందులో భాగంగా వడ్లపూడి హైవే నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు ఇరువైపులా జరుగుతున్న ఫుట్ పాత్ పనుల కోసం జీవీఎంసీ నిధులు మంజూరు చేయించడం జరిగిందని. సంబంధిత అధికారులను కలిసి నాణ్యత తగ్గకుండా పనులు త్వరగా పూర్త చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అభివృద్దె కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని బోండా అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు, డీవీ అప్పారావు, వర్రే రాంబాబు,పావడా వెంకట రమణమూర్తి,జాన్ రమేష్,పద్మ కళ్యాణ్ చెక్రవర్తి,దాలయ్య, మూర్తి, ఆదినారాయణ పాల్గొన్నారు.

## వసతి గృహంలో నాణ్యతలేని భోజనం.

- వసతి గృహంలో రుచిగా లేని ఆహారం.పశువుల తొట్టిలో వేస్తున్న విద్యార్థులు.
- .నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్ పై తగిన చర్యలు తీసుకోవాలి.
- గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.కోరంగి సీతారాం.





**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 19 పెన్ పవర్.**విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వసతి గృహ వార్డెన్.గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహంలో వార్డెన్ మెనూ పాటించకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని గిరిజన సంఘ నాయకులు గురువారం నాడు ఆవేదన వ్యక్తం చేశారు.కొంతమంది విద్యార్థులు అయితే నాణ్యతలేని భోజనం తినలేక పశువులకు వేస్తూన్న దృశ్యాలు వేలుగులోకి రావడంతో భోజనం ఏ పరిస్థితిలో ఉందో అర్థమవక తప్పదు.ఈ విషయంపై తల్లిదండ్రులు అటు గిరిజన సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి భోజనం కొనసాగితే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.కోరంగి సీతారాం.మాట్లాడుతూ.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించక వారి అనారోగ్యానికి కారణమవుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఇది వసతి గృహంలో పనిచేస్తున్నటువంటి వార్డెన్స్ తప్పిదమా,లేక సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమా.అని గిరిజన సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నారు.ఈ విషయంపై తక్షణమే వసతి గృహ వార్డెన్ పై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నాయకులు మరియు విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నామన్నారు.

పెన్ పవర్

శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పనితీరు బాగుంది

- సిబ్బంది కొరత ఉంటే తెలియజేయండి
- జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. మహేష్





**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,19:**కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పనితీరు బాగుందని అలాగే ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఏమైనా ఉంటే తమకు తెలియజేయాలని కాకినాడ జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కే, మహేష్ అన్నారు. అకస్మయ తనిఖీలో భాగంగా గురువారం మండల పరిధి జెడ్ రాగంపేట పరిధిలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలు లోపల అన్ని గదులు పరిశుభ్రంగా ఉన్నాయని ఈ సందర్భంగా సూపర్డెంట్ ప్రణీత్ నీ అభినందించారు. అలాగే ఆరోగ్యశ్రీ విధి విధానాల గురించి, ఆసుపత్రిలో ఉన్న ఎక్విప్మెంట్ పనితీరుపై, సిబ్బంది కొరతపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పూర్తి సిబ్బంది ఉన్నారా లేరా లేకుంటే తమ దృష్టికి తేవాలని తెచ్చిన ఎడల తొలితిగతిన సిబ్బంది కొరత తొలగిస్తామన్నారు. ఈ వెంట సూపర్డెంట్ ప్రణీత్ తో పాటు ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు





**కొత్త పేట పెన్ పవర్ ఫిబ్రవరి 19:**కొత్తపేటలో హిందూ సామ్రాజ్య స్థాపకుడు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోరక్షకులు, హిందూ ధార్మిక నాయకులు కోటిపల్లి రఘురాం వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బోడి పాలెం వంతెన సెంటర్ వద్ద శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, అనంతరం ర్యాలీగా బయలుదేరి వాడపాలెం పంచాయతీ సెంటర్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలలు అర్పించి "జై భవానీడ వీర శివాజీ" నినాదాలతో కొనియాడారు. ఆర్ఎస్ఎస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు మాట్లాడుతూ శివాజీ చిన్న వయస్సులోనే తోర్నా కోటను స్వాధీనం చేసుకుని గెరిల్లా యుద్ధతంత్రంతో మొఘల్, బీజాపూర్ సుల్తానులను ఎదిరించి స్వరాజ్యాన్ని స్థాపించారని తెలిపారు. 1674లో రాయఘడ్ కోటలో ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకుని అష్టప్రధాన్ మండలి ద్వారా పరిపాలన సాగించారని చెప్పారు. మహిళల పట్ల గౌరవం, ఇతర మతాల పట్ల సహనం ఆయన ప్రత్యేకతలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటిపల్లి సుబ్రహ్మణ్యం, కోటిపల్లి దామోదర్, గంగారాం, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్ధులకు ఆర్థిక సహాయం





**రావులపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 19:**వేదిరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఐదు మంది విద్యార్థులకు రూ.3,000 చొప్పున మొత్తం రూ.15,000లను ఎంఈఓ-2 శ్రీనివాసరాజు చేతుల మీదుగా తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. సహాయం పొందిన విద్యార్థులు సుధీర్, ప్రశాంత్, సాయి గణేష్, సిద్దు విలాస్, సాయి. ప్రధానోపాధ్యాయులు వి. మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ద్వారా ఈ సహాయం అందించబడిందన్నారు.

పాఠశాల చైర్మన్ మారే సుబ్బాయమ్మ మాట్లాడుతూ పీఎం షరి యోజన కింద రావులపాలెం మండలంలో తమ పాఠశాల ఎంపిక కావడం గర్వకారణమని, ఈ పథకం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, సీఆర్పీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఏపీ ఎఫ్ ఆర్ ఫారం ఐడి తప్పనిసరిగా ఉండాలి

వ్యవసాయ అధికారిని లక్ష్మి



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 19:**రైతులు అందరకీ కూడా ఏ.పి.ఫ్.ఆర్ ఫార్మర్ ఐ.డి. తప్పనిసరిగా ఉండాలి గండేపల్లి వ్యవసాయ అధికారిని లక్ష్మీ తెలిపారు. ఈ ఏ.పి.ఫ్.ఆర్ ఫార్మర్ ఐ.డి. ఉండటం వల్ల కలుగు లాభాలు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు పి.ఎం కిసాన్

పంట బీమా పంట నష్టం పరిహారంలి ఇన్పుట్ సబ్సిడీ అన్నదాత సుఖీభవ వంటి అన్ని పథకాలు లబ్ది పొందుతారు అన్నారు. రైతులు అందరూ ఇది గమనించి ఈ 11 అంకెల గల ఏ.పి.ఫ్.ఆర్ ఫార్మర్ ఐ.డి. రిజిస్ట్రేషన్ మీ దగ్గరలో గల లిరైతు సేవ కేంద్రం లో కానీ ఈ ఏ పి ఏ ఐఎంఎస్ యాప్ ద్వారా కానీ చేయించుకోవాల్సిందిగా కోరుకుంటున్నామన్నారు.

లిఏ.పి.ఫ్.ఆర్ ఫార్మర్ ఐ.డి. రిజిస్ట్రేషన్ కొరకు ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్ ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ భూమి వివరాల్లో సమస్యలుంటే రైతు సేవ కేంద్రంనీ సంప్రదించవలెను లక్ష్మీ తెలిపారు.

## చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారి బుట్టగరగకు అంకురార్పణ..



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 19;**ఉభయ రాష్ట్రాల భక్తులు కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా పేరుగాంచిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, ఆలమూరు మండలం చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలకు దేవస్థానం అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. ప్రతీఏటా పాల్గుణ శుద్ధ విదియ నాడు అమ్మవారిని బుట్టగరగ రూపంలో అలంకరించి చుట్టపక్కల గ్రామాల్లో గ్రామోత్సవం జరపడం ఆనవాయితీ. దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆలయ చైర్మన్ వీరి అప్పారావు ఆధ్వర్యంలో తాటాకులతో అల్లిన బుట్టగరగను వేపమాలలు, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మార్చి 2 వరకు మండలంలో అన్ని గ్రామాల్లో ఈ ఊరేగింపు ఉత్సవం జరగనుంది. ఈ నెల 20 నుంచి 12రోజుల పాటు ఉత్సవం నిర్వహిస్తారు. మార్చి 17న పెద్ద జాగరణ, 18న తీర్థం, 19న ఉగాది వేడుకలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 17 వరకు నెలరోజుల పాటు తీర్థం జరుగుతుందని ఈవో తెలిపారు. ఉత్సవానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీర్రాజు చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వీరి అప్పారావు, దొమ్మేటి రామకృష్ణ, వైట్ల శేషుబాబు, గన్ని చిన్నబ్బు, వైట్ల గంగరాజు, వాక గోవిందరాజు, పలువురు గ్రామ పెద్దలు, ఆసాధులు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ ఇఇఇ విభాగంలో ముగిసిన వర్క్ షాప్



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 19:**గండేపల్లి: ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఇఇఇ ) విభాగంలో "ఎలక్ట్రిక్ వెహికల్ మోడలింగ్ మరియు డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ప్లానింగ్ విత్ మాట్ లాబ్ " అంశంపై రెండు రోజుల హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ (ఫిబ్రవరి 18, 19 తేదీలలో) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్గా జెఎన్‌టీయూకే (కాకినాడ) ఐక్యుఏసీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర పాల్గొని, ఎలక్ట్రిక్ వెహికల్ మోడలింగ్ మరియు డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ప్లానింగ్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రో-వైస్ చాన్సలర్ డా. ఎ. రమేష్ పవర్ సిస్టమ్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విభాగాధిపతి డా. మానం రవీంద్ర పవర్ సిమ్యులేషన్ సర్క్యూట్ అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రో-వైస్ చాన్సలర్ డా. ఎ. రమేష్, డీన్ (అడ్మిన్) డా. వై.కె.ఎస్. సుబ్బారావు, విభాగాధిపతి డా. మానం రవీంద్ర, కోఆర్డినేటర్ డా. కె.ఆర్.కె.వి. ప్రసాద్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకినాడ నగర సుందరీకరణకు ప్రత్యేక చర్యలు






కమిషనర్ సత్యనారాయణ

**కాకినాడ పెన్ పవర్, ఫిబ్రవరి 19:**కాకినాడ నగరాన్ని మరింత సుందరీకరణతో తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం ఆయన శశికాంత్ నగర్, ఫ్రెండ్స్ కాలనీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

కాలనీల్లో చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రత వంటి అంశాలపై అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు.

నగర సుందరీకరణలో పారిశుద్ధ్యం కీలకమని పేర్కొంటూ ప్రతి కాలనీ శుభ్రంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

త్రాగునీటి నాణ్యత పరీక్ష

ప్రజల సమక్షంలోనే త్రాగునీటి నమూనాలను పరీక్షించి, వాటి శుద్ధి స్థాయిని వివరించారు. కార్పొరేషన్ సరఫరా చేస్తున్న త్రాగునీరు పూర్తిగా సురక్షితమైందని తెలిపారు. ప్రజల్లో ఎలాంటి అనుమానాలు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పన్నుల వసూళ్లపై పిలుపు

నగర అభివృద్ధికి ఆస్తి పన్ను, నీటి పన్ను వంటి పన్నుల వసూళ్లు కీలకమని పేర్కొన్నారు. పన్నులను సకాలంలో చెల్లించి కార్పొరేషన్‌కు సహకరించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని అన్నారు. పార్కుల అభివృద్ధి పచ్చదనం పెంపు

పర్యటనలో భాగంగా ఆయా కాలనీల్లో ఉన్న పార్కులను సందర్శించి పచ్చదనం పెంపు, పిల్లల ఆట పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలనీవాసులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం నగర పాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజల వినతులు పరిష్కారానికి హామీ

రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాలనీవాసులు డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల మరమ్మతులు, రోడ్ల మరమ్మతులు వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టిపిఎస్ రామ్మోహన్, డీఈలు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో ద్రావణాల పిచికారీపై అవగాహన

**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 19;**వరిలో గ్రోత్ ప్రమోటర్గా కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణం పనిచేస్తుందని, ప్రకృతి వ్యవసాయ విధానంలో ద్రావణాలు పిచికారీకి డ్రోన్ వినియోగం వల్ల అధిక ప్రయోజనాలు ఉంటాయని ఆలమూరు మండల ప్రకృతి వ్యవసాయాధికారులు కర్రా సూర్యప్రకాష్, మేరేటి శ్రీనివాస్ లు తెలిపారు. నర్సిపూడిలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయవిభాగం ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్ తో ద్రావణాల పిచికారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ వినియోగించి కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణం పిచికారీ చేశారు. ఈ ద్రావణాన్ని గ్రోత్ ప్రమోటర్గా వ్యవహరిస్తారని వారు తెలిపారు. వరిలో చీడపీడల నివారణకు, పేనుబంక అరికట్టడానికి ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దొంగ నాగసూర్యవతి,తోరాటి నాగమహేశ్వరావు,నాగుబాబు, కె జ్యోతి,ఆర్ రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com